# మూతపడని కన్ను

నారాయణమూర్తి ఆవూరువచ్చి నెల దాటుతోంది. ఇళ్ళకోసం తిరుగుతూనే వున్నాడు. ప్రతీదానికీ ఏదో లోపం కనపడుతోంది. విసుగుపుట్టి కొన్నాళ్ళు ఆ ప్రయత్నము విరమిద్దామనుకొన్నాడు. ఆఫీసునుంచి రాగానే హోటల్ యజమాని పిల్చి "మీకోసం ఎవరో ఒక ఆయన వచ్చివెళ్ళారు సార్. మళ్ళా ఆరుగంటలకి వస్తారట. మీరువస్తే రూములోనే వుండమని చెప్పి వెళ్ళారు" అని చెప్పాడు.

మూర్తికి రోజూ సాయంత్రము సముద్రపొడ్డుకి వెళ్ళే అలవాటు. ఆ రోజు ఆ వచ్చిన వ్యక్తికోసం చూస్తూ గదిలో కూర్చున్నాడు. కిటికీలోంచి రోడ్డు చివరదాకా చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. తను వున్నగది ఏమంత బాగా లేక పోయినా, బైటచూస్తే దూరంగా మైదానం, అవతల తాటి చెట్లు, చిన్న చిన్న గుడిసెలు; దూరంగా ఆ సముద్రం ఆకాశంలో కలిసినట్టు కన్పిస్తోంది. చీకటిపడ్డా ఎవరూ రాలేదు. విసుగొచ్చి 'ఎవరు వచ్చివుంటారా' అని ఎంత ఆలోచించినా 'ఎవరూ' గుర్తుకి రావటంలేదు. ఆ గది నాలుగుమూలలా తిరుగుతూ, కొంచెముసేపు కిటికీదగ్గర నిల్చుంటూ, చివరకి కాగితంమీద వచ్చిన ఆయన్ని తెల్లవారివచ్చి కలుసుకోమని వ్రాసి హోటల్ యజమానికి ఇచ్చి వెడదామని బయలు దేరాడు. బయటికి వచ్చేసరికి మూర్తి, మామగారు, ఇంకో నలుగురిని కూడా తీసుకువచ్చారు. 'ఎవరో' తెలిసిన అతన్ని హాస్పటల్‌లో చేర్చేందుకు వచ్చారట. అనుకోకుండా బయలుదేరాల్సి వచ్చిందట. మళ్ళా ఆ మరునాడు వెళ్ళిపోవాలట. ఆ సాయంత్రము ఆయన స్నేహితుడి ఇంటికి వెళ్ళినప్పుడు ఇళ్ళ ప్రస్తావనవచ్చి ఎదురింటి మేడమీద ఖాళీగావుంది. కావాలంటే

మాట్లాడుదామన్నాడని చెప్పారు.

మూర్తి, మామగారు, ఆయనతో వచ్చినవాళ్లూ కలిసి ఇల్లు చూసేందుకు వెళ్ళారు. ఇల్లు బాగానేవున్నా లోపలికి వెళ్ళేందుకు సందులోంచి వెడితే మెట్లగది వస్తుంది. కింద రెండుగదులు, పైన రెండుగదులు - బాగానే వుంది. యాభైకి ఒప్పించి అడ్వాన్సు ఇచ్చివచ్చారు. కారుషెడ్డుకూడా వుపయోగించుకోమని తాళము ఇచ్చాడు ఇంటియజమాని. అసలే విశాఖపట్టణం, అందులో డాబాతోటలో అంతమాత్రం విశాలమున్న ఇల్లు అంత తక్కువ అద్దెకి దొరకటం చాలా అదృష్టమని అనుకుంటూ, మామగారి స్నేహితుడిదగ్గర శెలవు తీసుకుని అంతా మూర్తిగదికి చేరారు.

తెల్లవారుఝామున వెడతాననీ, మళ్ళీ పదిరోజుల్లో రావాల్సివస్తుందనీ, వచ్చేటప్పుడు అమ్మాయి పద్మని తీసుకువస్తానని చెప్పి, ఈలోపల మంచిరోజుచూసి ఆ ఇంట్లో ప్రవేశించమని చెప్పి, అందరూ అక్కడ భోజనం పూర్తిచేసుకుని ఇంకెవర్నో కలుసుకోవాలని వచ్చినవాళ్ళతో కలసి మామగారు వెళ్లారు.

మూర్తికి ఇల్లు దొరికినందుకు సంతోషంగావున్నా, పద్మవచ్చి, వాళ్ళ నాన్న ఒక్కరోజులో ఇల్లు కుదర్చటం, ఇంటికోసం తను ప్రయత్నము చేసివుండనని దెప్పటానికి వీలు దొరికినందుకు కొద్దిగా విచారం కలిగింది.

'పద్మని తీసుకొని బావమరది చంద్రము వస్తున్నా'డని టెలిగ్రా మొచ్చింది. ఎప్పుడూ మామూలుగావచ్చేరైలు ఆ రోజు రెండుగంటలు ఆలస్యమన్నారు. ఆరోజు సెలవుపెట్టి అక్కడే తిరుగుతూ గడపాల్సి వచ్చింది మూర్తికి. తీరా రైలు వచ్చేవేళకి కాఫీకి వెళ్ళిరావటంవల్ల ఆలస్యమవటం, ఆ చివర నుంచి ఈ చివరదాకా వెతికినా బావమరది చంద్రంకాని, పద్మకాని కనపడకపోవటంతో ఇల్లువెతుక్కుంటూ వెళ్ళారేమోనని, ఇంటికి వెళ్ళాడు. అక్కడకూడా ఎవరూ వచ్చినజాడ లేదు. రోజు అంతా వృధా అయినందుకు విసుక్కుంటూ పైకివెళ్ళి పడుకుందామనే ప్రయత్నంలో వుండగా, 'సూర్యనారాయణ మూర్తిగారి ఇల్లు ఇదేనా' అని 'ఎవరో' అడిగినట్లు వినిపించికిటికీలోంచి చూశాడు. ఒకజీపు, లారీ ఇంటిముందు వున్నాయి. కిందికివెళ్ళి చూస్తే సామానుతో సహా పద్మ ప్రత్యక్షమయింది మూర్తికి.

"మీకోసం స్టేషనులోపడి కూర్చున్నా. మంచిపని చేశారు. కారులో వచ్చేవాళ్లు 'వైరు' ఎందుకు ఇవ్వటం?" అని లేనికోపం తెచ్చుకు మాట్లాడాడు మూర్తి.

"సామాను లారీలోవేసి నేనూ, నాన్న రైలులో వద్దామనుకున్నాము. అన్నయ్యా జీపువస్తోందనీ, తనకి పనివుండి వెడుతున్నానీ చెప్పటంవల్ల నాన్నరావటం మాని అన్నయ్యతో పంపారు" అని చెప్పుకుపోతోంది పద్మ.

సామాన్లు అన్నీ లోపలికి చేర్చారు. 'కూలీలు వుండగానే సామాన్లు ఏవి ఎక్కడ పెట్టాలో పెట్టించమని' పద్మకు అన్నగారు చెప్పాడు.

మూర్తికి ఆ సామాను చూస్తే భయం వేసింది.

"సామానుకి ఇల్లు సరిపోయింది. ఇంక మనం బయట కూర్చోవాలి. ఇంత సామాను ఎందుకు తెచ్చావు, ఏదో కావాల్సినవి తేక? లారీ మళ్ళీ వెళ్ళేదేకనుక కొంత సామాను వెనక్కి పంపేయ్" అని మూర్తి అన్నాడు.

"మీకు తెలవదు వూరుకోండి. ఏమిలేకపోయినా జరగదు" అని చెప్పి తన అన్నయతో "ఈ సామానంతా తిప్పి పంపెయ్యమంటున్నారు చూడరా" అని ఫిర్యాదురూపకంగా అంది.

"బావ అన్నది నిజమే. ఉండేవాళ్ళు ఇద్దరు. ఇద్దరికీ ఇంతసామాను ఎందుకే? నాన్నకి మరీచాదస్తం! ఎవరు వద్దన్నా వినరు. మీరు తిప్పిపంపినా మళ్ళా ఆయన వెంట పెట్టుకువస్తారు.

ఇంక కొత్తవిరాకుండా చూసుకోండి" అని నవ్వుతూ సర్దటంలో సాయపడి సాయంత్రానికి సర్దటం పూర్తిచేశారు. చంద్రం మరునాడు వెళ్ళిపోయాడు.

ఇంటివాళ్ళ పనిమనిషినే పెట్టుకోవాల్సివచ్చింది పద్మమూర్తికి. అవుసరమైన పనిచేసేటప్పుడు వాళ్లు పిలవటం, ఆపని అక్కడేవదిలి అది వెళ్ళిరావటం, వేరేవాళ్ళకోసం ప్రయత్నము చేస్తున్నారనివిని అప్పలమ్మ కోడల్ని తీసుకువచ్చి "పెద్దపనులు నేను చేసుకుపోతా, మీ కూడా తిప్పుకుంటూ ఈ గుంటచేత మిగిలినది చేయించుకో" అని బతిమాలి పనిలోపెట్టి వెళ్ళింది.

ఏళ్ళు ఎన్నివున్నాయోకాని పొట్టిగా, కొండపల్లి బొమ్మలా, అమృత్‌షేర్‌గల్ చిత్రంలా మెరిసే నలుపూ, గుండ్రటి మొహము, పెద్దకళ్ళు, నవ్వితే మెరుస్తున్న పళ్లవరుస, పొట్టిగా చీరకట్టు, నున్నగాదువ్వి గట్టి చిన్నకొప్పు - చూడటానికి చిత్రంగా వుంది. ఒకమాట అర్థమయ్యేటందుకు చాలా సేపు అవుతుంది. 'ఏది' చెప్పినా నవ్వటం. ఎల్లాగో అవస్తపడి కొంచెం పని నేర్పింది. మూర్తి "నీ పేరేమిటి పిల్లా" అంటే, పట్టుకున్న కూజా కిందపడేసి వంటగదిదగ్గరికి పరిగెత్తుకువచ్చి, "మరి అండి, మరి అండి" అనటముతప్ప ఏంజరిగిందో చెప్పదు. ఏమిటో కనుక్కుందామని వెడితే కూజా తాలూకు పెంకులు వరండాలోపడి నీళ్ళు చక్కగా ఎండపెట్టిన వడియాల క్రిందకి జారుకొన్నవి.

"ఏమిటండీ గొడవ" అంటే "ఆ పిల్లని పేరేమిటి అన్నాను - అంతే కూజా అక్కడే పడేసి పరుగుపెట్టింది. దాన్ని మాత్రం పైకి పంపకు." అని విసుక్కున్నాడు.

"దాన్ని పేరడిగేది ఏమిటి? అస్తమానం విరామం లేకుండా నేను 'సింహాచలం' అని పిలవటం వినపట్టంలేదూ?"

"అడగడమూకూడా తప్పే? దాంతో నీళ్ళు తెప్పించి పెట్టు, టైము అవుతోంది" అన్నాడు.

ఇంకోరోజు ఇల్లు వూడ్చేందుకు ఆ పిల్ల పైకివెళ్ళేసరికి మూర్తి మొహానికి సబ్బునురగ రాసుకొనటం చేసి ఆ చీపురు అక్కడేపడేసి పరిగెత్తుకువచ్చి చివరమెట్టు దగ్గర కాలుజారిపడి, ఏడుస్తూ,

"అయ్యగారండీ, ఏసమేసుకుంటే నాకు భయమేసిందండి" అని గట్టిగా ఏడుపు మొదలుపెట్టింది.

"అయ్యగారు ఏంచేస్తే నీకెందుకే? నీపని నువ్వు చేసుకురాక" అని కసిరి, కూడావుండి పైకి తీసుకువెళ్ళి తుడిపించింది. వాళ్ల అత్తని పిల్చి, "దీనితో చాలా కష్టంగావుంది. రోజూ ఏదో వొకటి పగలకొట్టటం, పైకివెళ్లమంటే వెళ్ళటం, అయ్యగారు 'ఏదైనా' చెపితే 'అది' చెయ్యకుండా నాదగ్గరికి పరిగెత్తుకు వచ్చి కొట్టినట్టు ఏడ్వటమో, లేక ఆగకుండా నవ్వటమో - ఇల్లా విసిగిస్తోందనీ దీనితో పనిచేయించుకోలేననీ" పద్మ చెప్పింది.

ఆ పిల్లని తిట్టి 'ఇంటికెళ్ళాక నీ మామకి చెప్పి తన్నిస్తాచూడు, ఎర్రేశాలు వేశావంటే. అమ్మగోరు చెప్పినట్టుయినక పోయినావంటే గంజి యెయ్యను తెల్సిందా'?'

అప్పటిదాకా అమాయకంగా కనిపించినపిల్ల "నా కేమి భయమా? మా అయ్యా, అమ్మా లేరా? ఆడకేపోతా, నేను కట్టము చేస్తుంటే యింత వణ్ణము ఏత్తుండావు" అంది. "సూడండి అమ్మగారో దాని బుద్ధులు ఎట్టుండాయో అప్పుడే" అని అత్త చెప్పుతుంటె పద్మ ఆపిల్లని మందలించి, 'మీ అత్తని అల్లా అనకూడదని' బుద్ధి చెప్పి సర్ది పంపింది.

పద్మఅక్కయ్య అత్తగారు ఆవూరు 'ఎవరో' తెలిసిన వాళ్ళ ఇంట్లో పెళ్ళికివచ్చి వాళ్ళఇంటికి వచ్చింది. ఆమె పద్మతో "సముద్రపు ఒడ్డుకి వెళదాము తొందరగా పని

పూర్తిచేసుకో" మని చెప్పింది. సాధారణంగా మూర్తి ఆరు గంటలకి ఇంటికిరాడు. ఆవేళకి వచ్చెయ్యొచ్చు అని పని పిల్లని తీసుకుని వాళ్లు ఇద్దరూ బయలుదేరారు. పద్మ లేతమబ్బు పెద్ద జరీఅంచువున్న చీరకట్టుకుని ముదురు నీలంజాకెట్టు తొడుక్కుంది. పెద్దజడ, వళ్లువున్నా సన్నటినడుము, జాకెట్టుకీ, చీరకి మధ్య పొట్టమెరుస్తూ చిన్న మడతపడింది.

సముద్రము దగ్గరగా యిసుకలో నడుస్తున్నారు. అలలు దగ్గరికి వస్తోంటే, వెనక్కిరావటం, అవి తగ్గగానే ముందుకి వెళ్లటం - ఇల్లా చేస్తున్నారు. అత్తగారు ఇసుకలో కూర్చుంది.

మూర్తి ఆరోజు తొందరగా ఇంటికి వచ్చాడు. తాళం వేసి వుండటంచూసి, ఇంటివాళ్లని అడగాలనుకున్నా, ఎందుకో బయటికినడిచి, 'ఎటు వెడదామా' అని ఆలోచించి బీచివైపు బయలుదేరాడు. వంటరిగా వెళ్ళే అమ్మాయిలికి అన్వయించే టట్టు మాట్లాడుకుంటూ అబ్బాయిలూ, తమనిగురించి ఏమి చెప్పుకుంటున్నారోనని ఓరకంటచూస్తూ, విననట్టేవింటూ కాలేజీ అమ్మాయిలు వెడుతున్నారు. వాళ్లని దాటుకు ముందుకు వెళ్ళాడు. చేపలవాళ్ళ చిన్న చుట్టుగుడిసెలు రెండు మూడు వున్నాయి. అక్కడనిల్చుని ఎదుట వచ్చేపోయే వాళ్ళని చూస్తున్నాడు. ఎవరో దగ్గరగా వచ్చి వీపుమీద చెయ్యివేస్తే తిరిగి చూశాడు మూర్తి. వెంకటేశం భార్యని మూర్తికి పరిచయము చేశాడు. వాళ్ళు కొంచెముసేపు ఆఫీసు విషయాలు మాట్లాడుకున్నారు. వెంకటేశముభార్య "చూడండి. అక్కడ కూర్చున్న అమ్మాయిచీర ఎంతబాగుందో, ఆ లేతరంగుకి ఎరుపుఅంచు మీద జరీమెరుస్తూ చాలా నిండుగావుంది. ఆరోజున నేను తీసుకుంటాననంటే వద్దన్నారు" అంటోంది. వెంకటేశం "చీరకంటె అమ్మాయి బాగుందికనక చీరకి అందము వచ్చింది" అని నవ్వుకున్నాడు.

"చీర ఎల్లావుందన్నా కాని, అమ్మాయి విషయము అడగలేదు" అని కోపంగా చూస్తూ నిల్చుంది. వాళ్లు ఆ విషయమే వాదించుకుంటూ, వెళ్లేందుకు సెలవు తీసుకున్నారు. వెళ్లేవాళ్లు వెనక్కివచ్చి "చూడుమూర్తీ చూడనివాడిని చూడమని మళ్లీ నాపైనే నిందలు వేస్తోంది" అన్నాడు.

"ఆవిడ అడిగినదానికి చెప్పక నువ్వు వేరేచెప్పటం మూలాన్ని వచ్చింది. అప్పుడప్పుడు కొద్దిగా కలహాల్లాంటివి వుండాలి." అన్నాడు మూర్తి.

"నువ్వు వంటరిగా రావటం, ఏదో జరిగినట్లు వుంది?" "అబ్బే! అదేమీ లేదు. ఆవిడ తెమలదు. రమ్మంటే పాలవాడు రాలేదనో, పనిమనిసి రావాలనో, వంటకాలేదనో ఇవన్నీ అయ్యేసరికి మనిషి సంచారం వుండదు. అందుచేత నేనే వస్తూంటాను."

"మా ఇల్లాలు ఎప్పటికప్పుడే తయారుగా వుంటుంది కాని, మళ్ళీ వెళ్ళేదాకా దేనికోదానికి కోపంవస్తూ, పోతూ వుంటుంది-అవునా?" అన్నాడు.

"వూరుకోండి, మరీను-ఆవిడ తెమలినప్పుడే మా ఇంటికి తీసుకురండి" అని చెప్పి వెళ్ళిపోయారు.

ఇంతకీ వాళ్ళ కొట్లాటకి కారణమైన ఆమెను చూడాలని వెనక్కి నడిచేవెళ్లాడు మూర్తి. పనిపిల్ల ఇసుకలో పాతేసినట్టు కాళ్లు జాపుకుని ఇసకనిగుట్టలా పోసుకుంటూ కూర్చుంది. పద్మ కాళ్ళు ముడుచుకు, వొచెయ్యి యిసుకమీద ఆన్చి కొంగు జారుతుంటే పైకివేసుకుంటూ జడ ముందుకు వేసుకు వయ్యారంగా కూర్చుని కళ్ళు పెద్దవిచేసి ఆశ్చర్యంగా ఆవిడ చెప్పేది వింటోంది.

మూర్తికి నవ్వు వచ్చింది. 'సాధరణంగా ఆడవాళ్లు బయటికి వచ్చేటప్పుడు వాళ్లలోవున్న అందమంతా కనపడే అంత నేర్పుగా తయారవుతారు. కాని భర్తలు వీళ్ళని గమనించక, కొత్తవాళ్ళల్లో అందాలు వెతికేందుకు పుపక్రమిస్తారు. తను చేసే పని కూడా అదేనేమో రోజూ!

వాళ్ళు మాత్రము ఏమి తీసిపోయారు? 'ఎప్పుడూ వుండేవాడేకదా' అనో ఏమో, ఇంట్లో సాధారణంగా ముతక చీరలో, వెలిసిపోయినవో, లేక బొగ్గుపొడి వగైరాలతో అద్దినవో కట్టుకు అదేరూపు మనస్సులో ముద్దరలా చెరక్కుండా వుండాలనో ఏమో అన్నట్టు కనబడతారు. నోరుజారి భర్త తన ఇల్లాలిని మంచిబట్టలు వేసుకు, పువ్వులు పెట్టుకు, తనకి ఇష్టమైనట్టు తలదువ్వుకోమనండి - వెంటనే వో చిన్న వుపన్యాసము మొదలుపెట్టి - 'మీకు వయస్సు రాను రాను అసందర్భపు కోరికలు వస్తున్నాయి. మీరు చెప్పినట్లుచేస్తే, అంతా దిష్టిపిడతలా చూస్తారు! అని తనకి ఇష్టమైనట్టు చీర కట్టుకొని తనువేసుకున్న ముస్తాబుని భర్త మెచ్చుకోకపోతే అవునులెండి, నేను మీ దృష్టిలో మనిషినేకాను. అసలు నేనేమి చేసుకొన్నా బాగుండను కాదూ?' అంటూ మూతి ముడుచుకుని బిక్కమొహము పెడతారు - ఇల్లా ఆలోచిస్తూ మూర్తి వాళ్ళకి కొంతదూరంలో నిల్చున్నాడు.

పనిపిల్ల కళ్ళు మూర్తిమీద పడ్డాయి. ఏదో ఉపద్రవం వచ్చినట్లు 'అయ్యగోరు' అని ఒక్కకేక పెట్టింది. పద్మ ఉలిక్కిపడి 'ఏవిటే' అని చుట్టూచూస్తూ మూర్తివేపు చూపునిలిపి అప్పుడే వచ్చేశారే! అంటూ ఆశ్చర్యంగా నవ్వింది. మూర్తి వచ్చి వాళ్ళకు దగ్గిరలో కూర్చున్నాడు.

"ఈవిడ తెలుసు కదూ; అక్కయ్య అత్తగారు. బంధువుల ఇంట్లో పెళ్ళికి వచ్చారుట."

"మా అబ్బాయి అంత మందమతి అనుకోవాలి అని - కాకపోతే నేను ఎవరో గుర్తుపట్టలేడనుకొన్నావా? చూడు నాయనా, అప్పను మించిన గడుసుది, వాళ్ళదగ్గర జాగ్రత్తగా వుండకపోతే మనల్ని బుట్టలో పెడతారు" అంది అత్తగారు.

మూర్తి నవ్వి, ఆవిడ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. పద్మ 'ఫలానా' అని చెప్పకపోతే మూర్తి ఆవిడని అసలు గుర్తుపట్టలేడు. మూర్తి చూసినప్పటికే ఆవిడ విశాలమైన మనిషి - ఇప్పుడు మరో మూడింతలు పెరిగింది. అంతా ఇంటికి చేరుకున్నారు.

పద్మ మూర్తితో రహస్యంగా "ఆవిడ నన్ను తనతో పెళ్ళివారి యింటికి రమ్మంటోందికాని, మీరు ఏదయినా చెప్పి నన్ను పంపకండి" అంది.

"పద్మా, అతనికి చెప్పిరా, వెడదాము" అంటూ అత్తగారు పైకివచ్చింది.

"ఆ, వస్తున్నా" అని, మూర్తికి చెప్పమని కళ్ళతో సైగచేసింది.

పద్మని ఏడిపించాలని, మూర్తి "మీతో తీసుకువెడుతున్నారా?" అని అడిగాడు.

"మరే, రమ్మంటున్నాను. తను లేకపోతే నీకు ఏమీ తెలీదుట. రానంటూ మారాము చేస్తోంది. వాళ్ళతోటే అంతావున్నట్టు గర్వము అప్పకీ చెల్లెలికీ."

అప్పటికే కందగడ్డలా అయిన పద్మమొహము చూచి నవ్వుకున్నాడు మూర్తి.

"పుట్టింట్లో వుంటేమాత్రము మనసంగతే గుర్తుండదు. ఇక్కవుంటేమాత్రము ఒక్కగంట ఆలస్యంగా వచ్చినా సహించదు. ఒక్కరోజు ఎక్కడకీ వెళ్ళకూడదు. మా వదినగారు కూడా అంతేనా?" అన్నాడు.

"అడగాలీ యింకా? పెళ్లికిరమ్మని బతిమాలా, ససేమిరా రానంది. మీఅబ్బాయి వస్తేనే వస్తానంది - 'వాడికి తీరదాయె. పాపం ఏ చేస్తాడు. వట్టి అప్పుడు ఎక్కడికీ తీసుకువెళ్లరని సాధింపు. తీరావెళ్లమంటే, మీరువస్తేతప్ప వెళ్ళనంటుంది' పద్మా, అయిందా?" అన్న అత్తగారికేకకి వులిక్కిపడి, ఆవిడ చూడకుండా మూర్తి కేసి తొందరగా చెప్పమన్నట్టు కోపంగా చూసింది.

మూర్తి అంతవరకూ తనకు పద్మ వెడుతుందన్న సంగతి తెలీనట్టు "మీరు ఇప్పుడు పెళ్లి వారిఇంటికి వెళ్లాలా?" అన్నాడు.

"మరే! రాత్రికేగా ముహూర్తం. నువ్వువస్తే బాగుంటుందికాని; ఎవరో వస్తారంది.

పద్మని తీసుకువెడతా. పొద్దున్నే వస్తాము" అంది.

"తీసుకువెళ్ళడం తప్పులేదుకాని, వచ్చేది ఆవిడ స్నేహితురాలే, మళ్ళా తెల్లవారుఝామున వెడుతుందిట" అన్నాడు.

"అదేమిటో, అబ్బాయి స్నేహితుడన్నావు - సరేలే, నిజం మాట్లాడ్డం వాళ్ళకి అలవాటులేదు. అప్పాయిదేవరస, మావాడు చెపితేతప్ప అసలు సంగతి తెలీదనుకో. నువ్వురానంటే పెందరాళే వెళ్లేదాన్నిగా?"

"పోనీ మీ అబ్బాయి అక్కడదాకా వస్తారు" అంది పద్మ.

మూర్తి ఆవిడని మహారాణిపేటలో పెళ్ళివారి ఇంటి దగ్గర విడిచిపెట్టి వచ్చాడు. పద్మ మూర్తి వచ్చేదాకా ఎదురు చూస్తూ కిటికీదగ్గర నిల్చుంది. భోజనాల దగ్గర మౌనంగా పూర్తిచేశారు.

పద్మ మంచినీళ్ల కూజాతో పైకివచ్చింది. వరండాలో అటూ ఇటూ తిరుగుతున్నాడు మూర్తి. పమిట చుట్టూతిప్పి గట్టిగా దోపివుండటం, జాకెట్టు పైకిజరిగి, కూజా బరువు రెండు చేతులతోటి పట్టుకోవడం - బిగపెట్టినట్లు గుండ్రంగా చిన్న గుమ్మడికాయలా దీపపుకాంతి పడి ఒకపక్క పొట్ట మెరుస్తోంది. మూర్తి వేళ్లతో కొడుతూ నవ్వుతున్నాడు. పద్మదూరంగా జరిగి, "ఆవిడతో అల్లా మాట్లాడితే ఏమనుకుంటుంది? ఇంటికి వెళ్లాక అక్కనీ, నన్నూ కూడా కలిపి తిడుతుంది.

"అదా, నీ బాధ? మీ అక్కని తిట్టినా బాధలేదు కాని నిన్ను తిడుతుందని. అంతేనా?' ' అన్నాడు మూర్తి. 'వూరుకోండి' అంటూ గునుస్తూ వెళ్లిపోయింది.

కాలం నెమ్మదిగా వొడుదుడుకులు లేకుండా జరుగుతూ, మధ్యలో పద్మని పంపమని తండ్రి వ్రాసే ఉత్తరాలకి పద్మ ఇప్పుడు వచ్చేందుకు వీలులేదనో, భోజనం కుదరదనో మూర్తి చేత వ్రాయించి, వెళ్లటం తప్పించుకునేది.

మూర్తి ఆరోజు ఆఫీసుకు తొందరగా వెళ్లాలని బట్టలు పెట్లోవన్నీ బైటవేసినా తనకి కావల్సినది కనపడకపోవటంతో మరీ విసుగుపుట్టి పద్మని పిల్చాడు.

"వస్తున్నానంటే వినపడదు బాబు మీకు. అన్ని సార్లు ఎందుకు పిలవటం?"

"అక్కడ మునిగిపోయే పని ఏమిటో? పిలవగానే రారాదూ?" అన్నాడు మూర్తి.

"ఇంటావిడ, అప్పలమ్మ మాట్టాడుతోంటే ఎల్లారాను?"

"ఆమాటలు ఆపి రావాలి. నాజోళ్లు కొంచెము ఇల్లా తెచ్చిపెట్టు. పనిపిల్ల మాటేనా?"

"చెప్పేమాట పూర్తిగా చెప్పనిస్తేగా! ఆపిల్ల పెద్ద మనిషి అయిందట వారందాకా ఇంకో మనిషిని పంపుతా నంటోంది పనికి. ఎవరయితే ఏం పంపమన్నా" అని చెప్పింది.

మూర్తి ఇంటికి వచ్చేసరికి చాలా పొద్దుపోయింది. పద్మ తలుపుతీసి నిల్చోలేక అల్లాగే గడపమీద కూర్చుని చేతుల్లో తలపెట్టుకుని ఏదో బాధపడుతూ 'మీరు భోంచెయ్యండి నాకు ఆకలిలేదు' అంటూ లేని మెల్లగా మెట్లను పట్టుకుని చిన్న పిల్లలు పడకుండా కూర్చుని ఎక్కినట్లు ఎక్కుతోంది. మూర్తి నిల్చుని చూస్తున్నాడు. మొదట ఆలస్యమైనందుకు కోప మనుకున్నా, అవస్థపడుతూ మెట్లెక్కటము చూసి జాలివేసి చెయ్యిపట్టుకు పైకి తీసుకు వెళ్ళాడు. పద్మకి ఆరాత్రి నాలుగైదు వాంతులయ్యేసరికి చాలా భయపడ్డాడు మూర్తి.

"వంట్లో బాగాలేదా" అంటే మాట్లాడదు. "డాక్టరుని పిలవమంటావా" అంటే 'వద్దు' అంటుంది. నీరసంగా కళ్లు మూసుకు మూలుగుతూ పడుకుంది. అడిగితే 'వద్దు' అంటుందని మూర్తి తలుపు వేసుకుని డాక్టరు దగ్గరికి బయలుదేరాడు. ఇంటి యజమాని తల్లి బైట

వరండాలో పడుకుంటుంది. సాధారణంగా ఆవిడ మెలకువగానే ఉంటుంది; వుండటమే కాకుండా ఏవో పాడుతూ వుంటుది. గేటుదగ్గర మూర్తినిచూసి ఆవిడ 'ఎవరు' అని పలకరించింది. 'నేనండి' అన్నాడు మూర్తి.

'ఇప్పుడు ఎక్కడికి నాయనా వెడుతున్నావు?' అని అడిగింది ఆవిడ. 'పద్మకి వంట్లో బాగాలేదు డాక్టరుని పిల్చుకు వద్దామని' అన్నాడు మూర్తి.

'ఆమాత్రము కష్టపడకుండా అబ్బాయో, అమ్మాయో పుడితే ముద్దులాడుదా మనుకుందా? వీటికి ఏమి మందులులే, వెళ్లి పడుకో నాయనా' అంటూ 'అన్నము ముట్టదూ' అని పాట మొదలు పెట్టింది.

మొదట అయోమయంగా తోచింది. వెళ్లకుండా వెనక్కి వచ్చాడు మూర్తి. అప్పుడే కొంచెము నిద్రపట్టింది పద్మకి. పద్మకేసి చూచాడు. దీపం తీసినా వెన్నెల మొహం మీద పడుతోంది కిటికీలోంచి గాలికి జుట్టు కొట్టుకుంటోంది. కళ్లకింద రెప్పలనీడ మధ్య వెన్నెలకాంతి పల్చగా కనిపిస్తోంది. కంటికొలికిలో నిల్చిన నీటిపైన పద్దకాంతి, గాలికి కదులుతూ మెరుస్తోంది. మూతి, బిగబెట్టడంతో ఇంకా చిన్నదిగా సున్నాలా కనపడింది. గెడ్డమువంపు దిండుపైన నీడలో పెద్దదిగా కనిపిస్తోంది. ఎప్పుడూ చిన్న చప్పుడైతేనే నిద్రపోనీ పద్మ యింత హాయిగా నిద్రపోవడము తల్లిని కాబోతున్నాన్న గర్వమేమో అనుకున్నాడు మూర్తి. లేపి అడుగుదా మనుకున్నాడు. నీరసంగా పడుకుంటే నిద్ర పట్టివుండవచ్చు అనుకుని కిటికీరెక్క ఒకటివేసి నిద్రపోయాడు మూర్తి.

పద్మరోజూ ఆ బాధకి అలవాటుపడి అల్లాగే అవస్థ పడుతూ గడుపుతోంది. మూర్తి "మీ అన్నయ్య వస్తారుట రేపు. నువ్వు కొన్నాళ్లు మీ వాళ్ల వూరికి వెళ్లివస్తే బాగుటుందనుకుంటాను' ' అని పద్మకేసి చూచాడు.

పద్మ తలవంచుకు సిగ్గుపడుతూ, "ఇప్పుడు వెళ్ళను. వెడితే అప్పుడే రానివ్వరు' ' అంటూ మంచముమీద పడుకుని గోడపక్కకి తిరిగి "మీకు కష్టంగా వుంటే చెప్పండి వెడతా' ' అని నెమ్మదిగా అంది.

"మీ అన్నయ్య కనక నువు రానంటే వూరుకుంటాడు. మీనాన్నవస్తే నువ్వేముందు బయలుదేరుతావు. రానన్నా ఆయన ఎల్లాగా తీసుకువెళ్ళటము మానడు. ఈసారి నువ్వు వెడతానని గొడవచేసినా పంపను. సరేనా? నువ్వు పనిచెయ్యటము కష్టమని వెళ్ళమంటున్నా, అల్లా మాట్లాడవచ్చా? నేను చెప్పినట్లు వింటే పంపను. రేపటినుంచి వంట మానెయ్యి. కొన్నాళ్ళు కేరియర్ తెప్పించుకుందాము" అన్నాడు మూర్తి. "ఎప్పుడైనా చెయ్యలేకపోతే తెచ్చుకోవచ్చు కాని రోజూ ఎందుకు?" అంది పద్మ.

పద్మ అన్నగారు రావటం, పద్మనుచూసి 'చాలా చిక్కిపోయిం'దని జాలి పడటం, తనతో పంపించమనటం, మూర్తి 'మీ చెల్లెలు వస్తానంటే తీసుకువెళ్ళ మనటం, పద్మ కోపంగా మూర్తికేసి చూడటం, 'ఇంకా నాలుగు రోజులు వుంటావుగా ఆలోచించుకుందాములే' అని మూర్తి మాట మార్చటం జరిగాయి.

అన్నగారు వున్నన్నాళ్లూ రోజూ సాయంకాలము బీచికి వెళ్ళి రాత్రి హోటల్లో భోంచేసి రావటం మామూలుగా జరిగినా ఆ రోజు దారిలోనే పద్మకు వాంతులు మొదలుపెట్టి, రాత్రి అంతా బాధపడటం చూసి అన్నగారు పద్మని తనతో తీసుకువెడతానని మూర్తికి చెప్పాడు. మూర్తికి మొదట పంపటము ఇష్టంలేకపోయినా, కొన్నాళ్ళు వెళ్లివస్తేనే మంచిదనిపించి, పంపేందుకు ఒప్పుకుని, పద్మని ప్రయాణానికి సిద్ధం చేసుకో మన్నాడు. అన్నగారి ఎదుట కోపము చూపించటము ఇష్టములేక ఎవరూ చూడనప్పుడు కోపంగా మూర్తిని చూసేది పద్మ.

తన తాలూకు సామాను ఒక్కటీ వుంచకుండా అవసరం లేకపోయినా అన్నీ తెచ్చి పెట్టెదగ్గర కుప్పగా పెట్టుకుంది పద్మ. మూర్తి అది గమనించినా మాటల ధోరణిలో చూడనట్టు వూరుకున్నాడు. అన్నీ పెట్టెలో పట్టించినా పెట్టెతాలూక్షు మూత పట్టనని భీష్మించుకుంది. పెట్టె ఒక పక్క నొక్కితే ఇంకోపక్క పైకిలేచి, రెండు పక్కలా గట్టిగా అదిమిపెడితే మధ్యన గొళ్ళెము పట్టక పెట్టెతో పద్మ పడే అవస్థచూసి, మూర్తి సహాయంచేద్దామని వెళ్ళాడు. 'ఇవన్నీ ఎందుకు; పదిరోజులుండి వచ్చేదానికి' అంటున్నాడు మూర్తి. పద్మ సమాధానము చెబుదామనే సరికి అన్నగారు వెనక వుండటముచూసి మొహము పక్కకి తిప్పి మూతి ముడుచుకు 'వుండాలిలెండి' అంటోంది. మూర్తి ఎల్లాగో పెట్టకు తాళంవేసి 'ఇంక మధ్యలో మాత్రము తియ్యకు' అన్నాడు.

పద్మపాలవాళ్ళకి ఇవ్వాల్సింది, పనిమనిసికి ఇవ్వాల్సింది, చాకలికి లెక్కచూసుకు ఇచ్చుకోమని, 'సామాన్లు అన్నీ ఎక్కడివి అక్కడ పడేస్తే పోతాయి అని, పనిమనిషి వెళ్ళేటప్పుడు చూడమనీ,' 'మీ ఇష్టము ఏమి చేసుకుంటారో, నేను చెపితే మీరు వింటారుకనకనా' అని అన్నీ అప్పచెప్పి తనకి ఆ ఇంటితో సంబందం లేనట్లు చెప్పటం వింటూంటే మూర్తికి నవ్వు వచ్చింది. వాళ్ల వెళ్లే రైలు రెండు గంటలకి వస్తుంది కనక తను ఆఫీసునుంచి వస్తే ఇంటికి వస్తానని, లేకపోతే స్టేషన్‌కి వస్తానని చెప్పి మూర్తి వెళ్లిపోయాడు.

పద్మ అన్నగారు పద్మని వెయిటింగ్ రూమ్‌లో కూర్చోపెట్టి మూర్తికోసము చూస్తున్నాడు. ఆరోజు రైలురావడం గంట ఆలస్యమని వ్రాసిపెట్టారు. మూర్తి రావటంకూడా అంత ఆలస్యమయింది. ఆఫీసరు క్రొత్తవాడని, ఆరోజు అందరి మీదా చాలా కోపంగా ఉన్నాడని, ఆరోజు శెలవుపెట్టివుండాల్సినదని అనుకుంటూ వచ్చానని మూర్తి చెప్పాడు. తను వచ్చే సరికి వాళ్లు వెళ్లిపోయి వుంటారనుకుంటూనే వచ్చానని చెప్పాడు. ఆలస్యముగా రైలు రావటముకూడా మంచిదయిందంటూ పద్మ కూర్చున్న దగ్గరికి వెళ్లాడు. పద్మ ప్రతిక్షణం బైటికిచూస్తూ, ఏం తోచక చీరకొంగు వేళ్లకి చుడుతూ, విప్పుతూ కొంతసేపు ఎదర కూర్చున్న వాళ్లనిచూస్తూ, కొంచెంసేపు అటూఇటూ తిరుగుతూ విసుగ్గా మళ్లీ వచ్చి కూర్చోటము - ఇలా గడుపుతోంది అంతసేపూ-

రైలు రావటంతోటే జనం ఫ్లాట్ పారముమీద ముందుకి కొందరు, వెనక్కి కొందరు ఎదరటివాళ్ళని చూడకుండా తోసుకొంటూ హడావిడిగా పరుగు పెడుతున్నారు. మూర్తి పద్మ చేతిలో మరచెంబు తీసుకుబోతే వద్దని మొహము ముడుచుకు దూరంగా నడిచివెడుతోంది. అన్నగారు పెట్టె చూపిస్తూ "ఇక్కడే, నువ్వు ఎక్కుముందు" అని లోపల పరిచిన జంబుకానా చూపించాడు. మూర్తి కూలీలచేత సామాన్లు పక్కగా పెట్టించాడు. సంపంగిపూల పొట్లము పద్మకి ఇచ్చాడు.

ఎవరో బైటనుంచి తొంగిచూసి మూర్తిని చెయ్యిపట్టుకు కిందకు లాగుతున్నాడు నవ్వుతూ. ఆకొత్తగా వచ్చినాయన్ని చూసిన గుర్తులేదు పద్మకి. మూర్తిని నడుముమీద చెయ్యేసిపట్టుకు దూరంగా తీసుకువెళ్ళేడు అతను. మిగిలిన వాళ్లతో కలిసి గట్టిగా నవ్వులు మాత్రము వినపడుతున్నాయి పద్మకి. గంటకొట్టారు. అన్నగారు కిళ్ళీ నములుతూ వచ్చి 'అతనేడే' అన్నట్టు పద్మకేసి చేశాడు. సమాధానంగా పద్మ మూర్తి వున్నవేపు చూపించింది. మూర్తి, ఆ కొత్తమనిషి కలిసి గబగబా వస్తున్నారు. మూర్తిని లోపల ఎక్కమంటున్నాడు ఆకొత్తమనిషి. మూర్తి అతనిని నా స్నేహితుడు "మాధవరావు" అని పద్మకి పరిచయము చేశాడు. పద్మ అన్నయ్యాని చూపి "ఆయన మా బావగారు" అని నవ్వుతూ మాధవరావుకి చెప్పాడు. రైలు కదిలింది. పద్మకి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. 'వెడుతున్నా' నని తల వూపింది పద్మ.

'నువ్వు వెళ్లటములేదా?' అని మాధవరావు మూర్తిని అడుగుతున్నాడు.

జేబురుమాలుతో మొహము తుడుచుకుంటూ 'లేదు' అన్నట్లు తలవూపాడు. మూర్తి పద్మకేసి చూస్తున్నాడు. వంగి కనిపించేవరకు చూస్తోంది. మూర్తి చేతిరుమాలు వూపుతున్నాడు. అన్నగారుకూడా చేతిగుడ్డ వూపుతున్నాడు కనిపించినంతసేపు.

మూర్తికి ఇంటికివస్తే, ఒంటరిగా వుండటము కొంచెము బాదగా వుండేది కొన్నాళ్లు. స్నేహితుల ఇళ్లకి వెళ్లి పొద్దుపోయేదాకా వుండి, హోటల్లో భోంచేసి సముద్రపు రొదవింటూ కొంతసేపు ఇసుకలో కూర్చుని ఇంటికి వచ్చేవాడు. పద్మ వెళ్లి రెండు నెలలు అయినా 'వస్తున్నట్లు' రాయదు. 'పనిమనిషి వస్తోందా?' 'ఆ పిల్లని పంపుతోందా?' మీరు కారియర్ తెప్పించుకుంటున్నారా?' 'స్నేహితులతో సంతోషంగా కాలం గడుస్తుందనుకుంటా' - ఈ రకమైన ఆరాలుతీసేవుత్తరాలు తప్ప 'తను ఏమి అవస్థపడుతున్నాడో అన్న జాలి లేకుండా హాయిగా పుట్టింట్లో మకాముపెట్టుకుని తను రమ్మని వ్రాసినా దానికి బదులుగా ఏవేవో వ్రాయటం' - వుత్తరం వచ్చినప్పుడల్లా కోపము ఎక్కువ అవుతోంది మూర్తికి.

మూర్తి ఆ సాయంకాలము ఇంటికి వచ్చేసరికి తాళము పెట్టిన తలుపుకి అతికించినంత దగ్గరగా ఆనుకుని నిల్చుని, మెళ్లో పూసలు అటూ ఇటూ తిప్పుకుంటూన్న పనిపిల్ల కనిపించింది. పద్మ వెళ్లాక ఆ పనిపిల్ల రావటం ఆ రోజే.

ఏం పిల్లా, బాగున్నావా?' అని తలుపుతీస్తూ అడిగాడు మూర్తి. కొంగుతో నోరు నొక్కుకుంటూ అరుగుమీదనుంచి కిందికి దూకి, అరటిచెట్లలో దూరి రెండు చెట్లని పట్టుకుని వింత జంతువుని చూసినట్లు చూస్తోంది మూర్తిని ఆపిల్ల. కింద పడిందేమోనని అటుచూస్తే దూరంగా గుంపుగా విచ్చలవిడిగా పెరిగిన అరటిచెట్లమధ్య, పిల్లనలుపుకి కొత్త అందము వచ్చినట్లు కనిపించింది.

మూర్తి తెల్లవారి లేచేసరికి చాలా పొద్దు ఎక్కింది. తలుపుతీసి పనిమనిషికోసము చూశాడు మూర్తి. కనపడకపోతే తనే వెళ్లుదామని బయలుదేరాడు కాఫీకి. ఫ్లాస్కు పైన వుంది పైకి వెళ్లి తేవాలంటే బద్దకంగా వుంది మూర్తికి. నెమ్మదిగా మెట్లు ఎక్కుతున్నాడు. మళ్లీ 'ఫ్లాస్కు ఎందుకులే' అనుకుని వెనక్కి తిరిగాడు. పనిపిల్ల చీపురుతో వెనక ఎక్కటము చూడలేదు. ఏమో తూలి పడబోయి పిల్ల జబ్బ పట్టుకున్నాడు మూర్తి. 'హిహి' అని నవ్వుతూ చెయ్యి జరిపి ముడుచుకు, ఇంకా పొట్టిగా వంగి మెట్లకిందకి పరుగెత్తింది.

'ఏంటిపిల్లా' అని అప్పలమ్మ కంఠము పక్కఇంట్లో నుంచి వినిపించింది.

ఇది ఏమి చెపుతుందోనని మూర్తి చూస్తున్నాడు.

'ఏమీ లేదులే' అని కిందపడ్డ చీపురు తీసుకు తిప్పి, అన్నీ సరిగా వచ్చేలాగ గోడకి కొడుతూంది'.

'పిల్లా కాఫీ తెస్తావా' అన్నాడు మూర్తి.

'నాకు తెల్దు. మా అత్తని పిలవండి. తెస్తాది'.

'నువ్వు పిల్చుకురా' అని కోపంగా అనగానే ఏడుపు మొదలుపెట్టింది.

'సరే బాగానే వుంది' అని విసుక్కుంటూ బైటకి వెళ్ళి ఆ పిల్లని ఇవతలకి రమ్మంటే రాకుండా నిల్చుంది.

అప్పలమ్మని పిల్చి 'కాఫీ తెమ్మంటే ఏడుస్తోంది చూడు' అన్నాడు మూర్తి.

'అదే వరసండి బాబా, ఇంటికాడ నామాట అసలే ఇన్దు. నేను తెచ్చి ఇస్తాలెండి. అమ్మగోరిమాట ఇంటాదండి. ఎప్పుడు వొత్తారండి అమ్మగారు.'

'ఏమో తెలీదు' అన్నాడు మూర్తి.

ఆరోజు మూర్తి హేమగారికి పద్మని తీసుకుని వెంటనే రమ్మని, తనవంట్లో బాగాలేదని

ఉత్తరం వ్రాశాడు.

ఆరాత్రే మూర్తి తండ్రి, అన్నగారూ వస్తూన్నట్టు స్టేషన్‌కి రమ్మని టెలిగ్రాము వచ్చింది. అప్పలమ్మని రెండు క్యారియర్లలో భోజనం తీసుకురమ్మని చెప్పి స్టేషన్‌కి వెళ్లాడు. మూర్తి తండ్రి రైలు దిగగానే వాళ్లు ఎందుకువచ్చారో చెప్పబోయాడు. అన్నగారు 'ఏమిటా ఖంగారు. ఇంటికి వెళ్ళాక మాట్లాడుకోకూడదూ' అన్నాడు.

'అంతేలే' అంటూ చెప్పబోయినమాట ఆపి దిగులుగా అటూ ఇటూ చూస్తున్నాడు మూర్తి తండ్రి.

మూర్తికి అన్నగారిమీద కోపము వచ్చింది. చిన్న పిల్లాడిని కసిరినట్టు తండ్రిని అల్లా అనటము ఏమిబాగుంది, అనుకున్నాడు. ఇంటికి చేరారు.

'మీరు ఇక్కడ వుండండీ, తలుపుతీసి, దీపమువేశాక వద్దురుకాని' అని మూర్తి వెళ్లాడు సందులోకి. తలుపుమీద చెయ్యిపెట్టి తడిమాడు తాళముకోసం. మెత్తగా చల్లగా చేతికి తగిలేసరికి వులిక్కిపడి వెనక్కితగ్గి, పనిపిల్ల ఏమోనని గుర్తుకి రాగానే చీకట్లో కిందకివురికి ఏకాలో విర్చుకుంటుందని తట్టి, చెయ్యి పట్టుకోబోయాడు. చీకట్లో మూర్తి చెయ్యి పొట్టపైకి జరిగింది. ఆ పిల్ల కిలకిలా నవ్వుతూ, మూర్తి చేతిని తన చేతులతో పట్టుకుని కాగితముపొట్లము నలిపినట్లు తిప్పుతోంది.

తాళము తీసి దీపమువేసి తండ్రిని లోపలకు తీసుకు వచ్చారు.

భోజనాలయ్యాక, పిల్లని వున్న అన్నమూ అవీ తీసుకు వెళ్ళమన్నాడు మూర్తి. వెళ్ళకుండా మెట్లపైన కూర్చుని కాళ్లు కిందకిరాస్తూ, పైకీ, కిందకీ చూస్తూకూర్చుంది.

'ఏం కావాలి? పొద్దుపోయింది వెళ్ళు' అంటున్నాడు మూర్తి. ఏదో చెప్పబోయి వాళ్ళ అత్తని, అప్పలమ్మని చూసి వూరుకుంది.

'అయ్యగోరు నిల్సుంటే నువ్వు కూకుంటావు ఏస. ంపెద్దోళ్ళకాడ ఎల్లా మసలుకోవాలో తెల్దుబాబయ్యా దీనికి' అంది అప్పలమ్మ.

'చీకట్లో దీన్ని ఎందుకుపంపావు? నువ్వురాక' అన్నాడు

'నేను కూడానే వచ్చానండి. ఆయమ్మగోరు పిలిస్తే ఎళ్లా' అంది.

'చూడు అప్పలమ్మా, మావాళ్లు వచ్చారుకాని, పొద్దున్నే నాన్నకు స్నానము అలవాటు. ముందు నీళ్లు కాచి యిచ్చి నీ పని తరువాత చేసుకో' అన్నాడు. 'మంచిది బాబయ్యా!' అంది అప్పలమ్మ.

ఆ పిల్లని రమ్మంది అప్పలమ్మ. కూర్చుని లేవకుండానే 'లోపల వణ్ణము వుందిట, తెచ్చుకోవాలి' అంది.

'నాకే పని చెపుతుండావు!'

మూర్తి అన్నయ్యకి నిద్రపట్టిందనుకొని తండ్రి 'శాంతకి పెళ్లి సంబంధము వచ్చింది. పిల్లవాడు మెడిసిన్ చదువుతున్నాడు. పదివేలు ఇస్తేకాని ఒప్పుకోలేదు. ఆఖరిపిల్లకదా, ఆస్తీ, చదువూవున్న సంబంధము కుదరటము అరుదు అని మీ అమ్మకి ఈ పెళ్లి చేయాలని పట్టుగా వుంది. మన తాహతుకి ఎక్కువ అయినా ఒప్పుకున్నాను. పిల్లాడికి పిల్ల నచ్చింది కనక గాని లేకపోతే 15 వేలదాకా ఇస్తామని వచ్చారట' అని మూర్తితో చెప్పాడు.

'మన అదృష్టం బాగుంది, లేకపోతే ఇరవై వేలయినా అమ్మ ఒప్పుకోమనేది' అన్నాడు అన్నగారు.

'ఆ మాత్రము ఇయ్యందే ఎవరు చేసుకుంటారురా? అయినా అమ్మ అన్నీ ఆలోచిస్తేనేగాని వోపట్టాన ఒప్పుకోదు' అన్నాడు మూర్తి.

'నీకేంరా చెపుతావు! పిల్లలు కలవాడిని వాళ్లకికూడా చెయ్యాలిగా? ఉన్నది అమ్మి, పెళ్లిళ్లు. పురుళ్లు వగైరాలకి ఖర్చుచేసి మనకి సున్నా చుడతారు.

మూర్తికి అన్నగారి ధోరణి నచ్చలేదు. తండ్రి చిన్న పుచ్చుకున్న మొహంతో కిటికీలోంచి బయటకి చూస్తున్నాడు. ఆ సంభాషణ ఆపి పొద్దుపోయింది, పడుకుందామని లేచాడు మూర్తి.

మూర్తికి మెళుకువ వచ్చేసరికి చీకటి పూర్తిగా వెల్తురుని వదలకుండా పట్టుకుంది. వెలుగు పెనుగులాడుతూ తన కాంతిని సైన్యంలా పెంచుకుంటోంది. తన రాజ్యంలోకి శత్రువులు రావటంచూచి సహించలేక భూమిని ఆశ్రయించినట్టు చీకటి కింద పొర్లుతోంది. ఏమిటి ఈ పిచ్చి ఆలోచన అనుకుంటూ తండ్రికి స్నానానికి నీళ్లు లేవేమో అనుకుంటూ వళ్ళు విరుచుకుంటూ లేచాడు మూర్తి. అగరువత్తులు వెలిగించి, దేవుడు బొమ్మలువున్న క్యాలెండర్లన్నింటికీ తడిసిన బట్టలతో పెట్టుకురావడం చూశాడు మూర్తి. 'చన్నీళ్లు పోసుకున్నారా' అని అడిగాడు మూర్తి.

'లేదు, ఆపిల్ల వేడినీళ్లు పెట్టింది పాపం' అన్నారు.

అన్నగారు ఏదో పనివుందని, ముందు వెడతానన్నాడు. 'అబ్బాయిని చూశాక వెడుదువుకాని' అన్నారు తండ్రి. 'ఆ నేను చూసేదేమిటి-మీరూ తమ్ముడూ వెళ్లిరండి' అన్నాడు ఆయన.

మెడికల్ కాలేజిహాస్టల్‌కి బైలుదేరారు మూర్తీ తండ్రి. ఎందుకోరా ఈ సంబంధము వాడికి. మీ వదినకుకూడా ఇష్టం లేదు. మీఅమ్మకి ఇదే చెయ్యాలని పట్టుగావుంది. ఇంట్లో రోజూ గొడవే. ఆస్తి పంచిపెట్టమని మీ వదిన మీ అమ్మతో అందిట. మీ అమ్మసంగతి తెలుసుగా. ఇది అంతా నాది. నేను ఉండగా ఆశ పెట్టుకోకు అందిట. మీఅమ్మ అనటం - మీ వదిన చెల్లిలిని ఈ అబ్బాయికి ఇద్దామనుకున్నారట. పిల్ల నచ్చక వద్దన్నారట. మీ వదిన చెప్పటం- వాళ్ళు వట్టి పేచీకోరు వాళ్లు. మావాళ్ళు ఇవ్వటానికి ఇష్టపడ లేదంటుంది. ఏమయితేనేం మన శాంతిని ఇవ్వటానికికూడా ఇష్టంలేదు' అని చెప్పారు.

హాస్టలు దగ్గర బండి ఆపి, 'మళ్లీ వస్తాము' అని చెప్పి పైకి వెళ్లారు, అబ్బాయి గది వెతుక్కుంటూ. మూర్తి తండ్రి ఆ అబ్బాయిని మూర్తికి పరిచయం చేశాడు. ఆ అబ్బాయిని చూడగానే 'ఎంత అందంగా ఉన్నాడో' అనిపించింది మూర్తికి. పసిమిరంగు వళ్లు, గాలికి కదులుతూన్న వంకెలజుట్టు నుదురు మీదికి జారి వూగుతుంది. పెద్దకళ్లు, నవ్వితే సొట్టలుపడే బుగ్గలు. వంపు తిరిగిన గెడ్డం - ఏదో వేషం వేసుకుంటూ వచ్చిన రాజకుమారిడిలా కనిపించాడు మూర్తికి. మూర్తి చూడడం చూసి సిగ్గుపడి తలవంచుకు 'కాఫీ తీసుకుంటారా?' అని అడిగి తెప్పించేందుకు వెళ్లాడు అతను. మూర్తి తండ్రి వద్దు అంటూ అతని వెనకాలే వెళ్లి పిలుచుకు వచ్చాడు.

"మీ నాన్నగారు నీకే ఇవ్వమన్నారు నీ ఇష్టమైన బట్టలు తీసుకో" అని డబ్బు చేతిలో పెట్టాడు.

ఇంటికి చేరుకునే సరికి పది అయింది. మూర్తి ఆరోజు శెలవు పెట్టి; బజార్లో ఏవో కావాలంటే తండ్రికూడా వెళ్ళాడు.

'అమ్మకి పిల్లాడు నచ్చివుంటాడు. అక్కయ్య పెళ్లికి బావ బాగాలేడు ఇవ్వనని ఎంత గొడవచేసింది' అన్నాడు మూర్తి.

"నీకు జ్ఞాపకంవుందే ఇంకా," అంటూ తండ్రీకొడుకులు నవ్వుకున్నారు.

మూర్తి తండ్రి ఆ రాత్రి బయలుదేరి వెళ్లిపోవాలన్నాడు. 'పెళ్లి పదిరోజులు వుంది-నువ్వునాలుగు రోజులు ముందువస్తే బాగుంటుంది' అన్నాడు మూర్తితో.

అన్నగారు 'ఇదేకాని ఇంకో ముహూర్తం లేదా? అప్పటికి నాకు శెలవు దొరుకుందో లేదో, అన్నాడు. 'తరువాత మూఢం వస్తుందిట. ముందే పెడితేసరి, శెలవు దొరక్క ఏం చేస్తుంది?' అన్నాడు తండ్రి.

తండ్రిని రైలు ఎక్కించి, అన్న సినిమాకీ రమ్మంటే వెళ్ళకుండా ఇంటికి వచ్చేడు మూర్తి. దార్లోనే వర్షం కిద్దిగా తుప్పర మొదలుపెట్టి ఇంటికి వచ్చేసరికి పెద్దదయింది. బట్టలు మార్చుకు తల తుడుచుకుంటున్నాడు మూర్తి. తలుపు చప్పుడైతే కిందికివచ్చి తలుపు చప్పుడైతే కిందికివచ్చి తలుపుతీసి చూశాడు. పనిపిల్ల పూర్తిగా తడిసి చేతులు ముడుచుకుని వణుకుతోంది.

'ఇప్పుడు ఎందుకు వచ్చావు?'

నుదురుమీదనుంచి కళ్ళమీదకి జారుతున్న నీళ్ళని వేళ్ళతో తీసి కింద జల్లుతోంది - 'అత్తకు ఇషమజ్వరమంటవచ్చింది, డాక్టరు దగ్గరికి ఎల్లేందుకు డబ్బులు కావాలంట - మిమ్మల్ని అడిగి తెమ్మంది' అంది పిల్ల.

పైకివెళ్ళి ఐదు రూపాయలు తెచ్చాడు. గోడమీద వేసివున్న పంచెతీసి మీదవేసితుడుచుకోమన్నాడు. పంచె వుండచుట్టి వాసన చూస్తోంది, ఆ పిల్ల.

'బలే వాసనేస్తాయి మీ బట్టలు సెంటు - వోసన' అని నవ్వుతోంది.

మూర్తి డబ్బు ఇవ్వబోయాడు కళ్ళల్లోకి చూస్తూ నిల్చుంది. 'వూ, తీసుకో' అని చేతిలో పెట్టబోయాడు. మూర్తి చెయ్యి పట్టుకుని గుండెలదగ్గర పెట్టుకు అదుముతూ 'ఎచ్చగా వుంది' - అంటూ కళ్లుమూస్తూ తెరుస్తూ మూర్తిని చూస్తోంది. మూర్తి నవ్వుతూ పిల్ల కేసి చూస్తున్నాడు. దానిచేతిలో పంచి తీసి తలపైనించిచుట్టి పొట్ట చేత్తో గట్టిగా నొక్కుతూ, 'వెళ్లు వాన తగ్గింది' అన్నాడు మూర్తి. కప్పిన పంచికిందకి చెయ్యి తీసుకుని పొట్టపైన పెట్టుకు రుద్దుతోంది.

సందులోంచి 'సించెలము' అని కేక వినిపించింది. మూర్తి కళ్ళతో వెళ్లమని చెపుతున్నాడు. వెళ్ళనని తల అడ్డంగా వూపుతోంది. పిల్ల చేతిలో డబ్బుపెట్టి గుప్పిట మూశాడు మూర్తి. వీపుమీద చెయ్యివేసి వెళ్ళమని గుమ్మంవేపు తిప్పాడు. వెళ్ళకుండా బిగుసుకుని గుమ్మాన్ని పట్టుక్కు నిల్చుంది. 'రావేమే' అని మళ్ళీ కంఠము వినిపించింది. మూర్తి కేసి అర్థంలేకుండా చూస్తూ నిల్చుని గోడని గోళ్లతో గీకుతోంది. జోళ్ళ చప్పుడికి తప్పుకుంది. మూర్తి అన్నగారు తడిసి పోయి వచ్చాడు. స్నేహితుడు కనిపిస్తే వాడితో వెళ్ళాననీ, సినిమాకి వెళ్లలేదనీ చెప్పాడు ఆయన.

పిల్ల తెల్లవారి రాలేదు. నాలుగు రోజులు ఎవరూ రాలేదు. ఎవరో కొత్తమనిషి వచ్చి 'అత్తాకోడళ్లు జరాలతో పడి వుండారెండి - రెండు రూపాయలు వుంటే అడిగి తెమ్మందండి.'

'పిల్లకి ఐదు రూపాయలు ఇచ్చాను' అన్నాడు మూర్తి.

"నాకు తెల్దండి ముసల్ది అడుక్కురమ్మని బతిమాలితే వచ్చా" అంది ఆ వచ్చిన మనిషి.

మూర్తి ఇచ్చి పంపాడు.

ఆ రోజు అన్నగారు వెళ్లిపోతానంటే, "నేను వస్తారేపు" అని ఆపాడు మూర్తి.

పొద్దున్న మూర్తి కాఫీ తీసుకు ఇంటికి వచ్చేసరికి అప్పలమ్మ మెట్లపైన కూర్చుని కళ్ళూ ముక్కూ తుడుచుకుంటోంది. మూర్తినిచూసి ఏడుపు మొదలుపెట్టింది. "ఏమిటి" అని ఎంతఅడిగినా చెప్పకుండా శోకాలు పెడుతోంది అప్పలమ్మ. మూర్తి అన్నగారు "చెప్పకుండా ఏడుస్తావేమిటి" అని విసుక్కున్నాడు. "ఆ పిల్ల బాబయ్యా అఖరిదాకా మీ మాటేనండి 'అయ్యగోరు' అనటం, నవ్వటం. ఆయాల ఈడకి వచ్చింది. తడిసివస్తే మీరు పంచి

యిచ్చారని సెప్పిందండి. తెల్లారి లెగలేదండి. నేను పోయి అది బతక్కూడదా....ఆభగవంతుడికి నామీద కనికరంలేదు" చెప్పుకుపోతోంది అప్పలమ్మ.

మూర్తి ఆ మాటవినగానే నమ్మలేకపోయాడు. కొంతసేపు మాటరాక ఆశ్చర్యంగా చూస్తూనిల్చుని, 'ఏదో మాట్లాడాలి'కదా అని "మందు ఇప్పించలేదా" అని అడిగాడు మూర్తి.

డాక్టరు మందు ఇప్పించాం బాబయ్యా. నూకల్లేవు దానికి' అని ఏడుస్తూ, సంధిలో కూడా మీరు ఇచ్చిన పంచి వదలకుండా గుండెలకాడ ఎట్టుకుని, సేతులు నలుపుకుంటూ "అయ్యగోరు మంచివోరు" అంటూ మీ వూసేనండి మీరు ఇచ్చిన డబ్బు మొల్లో పెట్టుకుందండి. మాకు సెప్పలేదండి. కొన్నాళ్ల మా అప్పకూతురుని పంపుతా, పని చేయించుకోండి' అంది అప్పలమ్మ.

'ఇప్పుడు వద్దులే ఇవాళ వూరికి వెడత్తా, వచ్చాక కబురు పెడతా' అన్నాడు మూర్తి.

"మంచిది అండి మళ్ళీ ఎప్పుడు వత్తారండీ?"

'పదిహేను రోజులు అవ్వొచ్చు' అన్నాడు మూర్తి.

"మీ డబ్బు వచ్చాక చేసి తీర్చుకుంటాబాబూ"

'పరవాలేదులే' అన్నాడు మూర్తి.

అప్పలమ్మ వెళ్లిపోయాక ఆ పిల్ల ఇంట్లో తిరుగుతూన్నట్టే అనిపించింది మూర్తికి.

రైలులోకూడా మూర్తి ఆలోచిస్తూ బైటికి చూస్తూ కూర్చోటము చూసి 'అల్లావున్నావేంరా?' అని అన్నగారు అడిగాడు మూర్తిని.

'జీవితమంటే భయమేస్తుందికదూ. ఆ పిల్లని తల్చుకుంటే జాలివేస్తుంది'-

'అదా' అల్లా ఆలోచిస్తే తేలేది శూన్యం. ఎవరికి ఎక్కడితో ఆఖరు అయితే అక్కడితో వెళ్ళిపోవాలి. చూడు, ఆ ముసలిది రాయిలావుంది. ఆ పిల్ల పోవటముచూస్తే మన చేతుల్లో ఏమీ లేదు అనిపిస్తుంది. తెరమీద బొమ్మలం. ఎప్పుడు ఏ బొమ్మని తీసేస్తే అక్కడితో అది ఆఖరు. మనమూ అంతే'.

మూర్తి అన్నగారి మెట్టవేదాంతం వింటోన్నా ఆ పిల్ల సినీమాల్లో రీల్సులా బుర్రలో తిరుగుతోంది. చదువూ సంస్కారమూ వుంటే వో రకంగా వుంటారని వూహించుకోడము పొరపాటేమో. కోరిక అందరికీ ఒకరకంగానే ఉండవచ్చు. ఒక వయస్సులో, అంటే చిన్నతనంలో కోరినదాన్ని సాధించాలనే ఆరాటంతో మనస్సు బాధపడటం, కొద్దిగా మధ్య వయసుకి జరిగేసరికి హోదాకి సంఘంలో గౌరవానికి తలుపులుతీసి మిగిలిన ద్వారాలకి తాళము వేసినట్లు నటించటము, మద్య వయస్సు దాటుతుందనే బెంగతో తనని ఎవరూ గుర్తించరనే భయం లోపల పలకరిస్తోంటే కొత్త స్నేహాలకి తహతహలాడటము, లభ్యము అయినవాడు ముదిమి, స్నేహాన్ని విడదీస్తుందనే బెంగతో బోడితల తడుముకుంటూ ఇంకా పదికాలాలు ముందుకి పంపుతాడు మనస్సుని. లభ్యముకానివాడు ఓటమికి మనస్సు బాధపడుతుంటే, మనస్సు అదిమిపట్టుకు వేదాంతం కోసము తల తడుముకుంటూ పదికాలాలు ముందుకు పరుగెట్టి బాహ్యప్రపంచాన్ని, అశాశ్వతమైన శరీరాల్ని, ఇంద్రియ లోలత్వాన్ని ద్వేషిస్తూ, వేదాంతపు నీడలు వెతుక్కుంటాడు....

తుని స్టేషన్‌లో రైలు ఆగింది. మూర్తి తొందరగా తన ఆలోచన ఆపుచేసి అన్నగారిని నిద్రపోతుంటే లేపాడు. ఆయన ఖంగారుపడుతూ దిగి పెట్టి, పరుపుచుట్ట దింపేసరికి రైలు కదిలింది. 'వుండిపోయిన సామాన్ల లిస్టు గట్టిగా చెపుతూ, జాగ్రత్తగా దింపుకోమని' - 'మీ వదినతో పిల్లల్ని జాగ్రత్తగా చూడమని' చెప్పటం పూర్తికాకుండానే ప్లాటుఫారం దాటి వచ్చింది రైలు.

మూర్తి మధ్యలో తెగిన ఆలోచనల్ని అతికించి, పొడిగిద్దామనుకుంటే, అతుకుల్లాగే సాగుతోంది ఆలోచన. "ఆ పిల్లకి చివరిదాకా మీమాటే" అన్న అప్పలమ్మ మాట చెవిదగ్గర హోరుపెడుతూ తిరుగుతోంది. పంచి దగ్గరే పెట్టుకు కళ్లుమూసిందిట...తనంటే నిజంగా ఇష్టమేమొ. ఆ పిల్లకి ఇష్టమేమిటి? ఏదో చిన్నతనపు చిలిపిచేష్టలు అయి వుండవచ్చు అనిపించింది కొంతసేపు. "చివరలో నామాటే ఎందుకు చెప్పాలి? ఏమో..." తనలో తను తర్కించుకుంటున్నాడు మూర్తి.

కొంచెం మూలగా కూర్చున్నాయన లేచివచ్చి మూర్తికి దగ్గరగా కూర్చుని 'మీరు ఫలానా ఆఫీసులో పని చేస్తున్నారుకదూ?' అని అడిగాడు.

అవునని తలవూపాడు మూర్తి.

'మావాడు కూడా అందులోనే వుంటున్నాడు' పేరు అడుగుతాడేమోనని మూర్తికేసి చూశాడు ఆ పెద్దమనిషి. 'మీకు ప్రమోషను వస్తుందని చెప్పుకున్నారు. నిన్న మావాడి కోసం ఆఫీసుకి వస్తే...అనుకోవటం విన్నాలెండి.'

ఈ మాటకి మూర్తి నవ్వి వూరుకున్నాడు.

'శెలవులో వెడుతున్నారా?' అని అడిగాడు ఆయన.

'అవును' అని తల వూపాడు మూర్తి.

'తునిలో దిగింది మీ అన్నగారా?'

'అవును' అని తల కిందకి వంచాడు మూర్తి.

'ఆయనమీద పెట్టిన కేసు ఏమయిందో తెలసిందా?' కళ్లు సగం మూసుకు 'తెలీదన్నట్టు' తల అడ్డంగా వూపాడు మూర్తి. మరో ఆయన ఆ కేసువివరాలు అడగటంతో మొదటి పెద్దమనిషి కేసు వివరాలు అడగటంతో మొదటి పెద్దమనిషి కేసు వివరాలు చెపుతూ ఐక్యమై పోయాడు.

సామర్లకోట వస్తోందని ప్రయాణికుల్లో చలనం కలిగింది. తలలు దువ్వుకోవటం, జేబులో డబ్బువుందో, లేదో అని తడిమి చూసుకోవటంలో వుండగానే రైలు ఆగటం జరిగింది. అందరిని తప్పించుకు సామాను దింపించుకుని మూర్తి దిగాడు. అన్నగారి తాలూకు సామాను ఇంకా ఏమయినా వున్నాయేమో నని మళ్ళీ బండిలో అన్ని ప్రక్కలా చూసివచ్చాడు మూర్తి. కూలీతో పెద్దాపురంవెళ్ళే బస్సులో సామాను పెట్టాలని చెప్పాడు.

మూర్తి ఇంటికి చేరేసరికి నీరెండ వుంది. ఇంటిముందు పెద్ద పందిరి వేశారు. ఎవరో పిల్లలు ఆడుతున్నారు. కటకటాలు దాటి హాల్లోకి వెళ్ళేడు. కొత్తవాళ్ళు - ఆడవాళ్లూ, పిల్లలూ కూర్చుని ఫలహారాలు చేస్తున్నారు. వాళ్ళ మధ్య లోంచి వెళ్ళడము ఇష్టములేక పక్కగది గుమ్మంలోకి వెళ్ళి చూస్తున్నాడు. ఎవ్వరూ కనబడలేదు అతనికి సందు తలుపు తియ్యటానికి. కూర్చున్నవాళ్ళ తాలూకు పిల్ల మూర్తి దగ్గరికి వచ్చి ఆ చేతులు మూర్తి పేంటుకి రుద్దుతూ లేచినిల్చుంది. ఆ పిల్లని తీసుకువెళ్ళటానికి వచ్చిన ఆవిడ పిల్ల వీపుమీద ఒకటి చరిచింది.

ఇంకో ఆవిడ దగ్గరికి వచ్చి "పెళ్ళికూతురు వో మాదిరిగా వుంది. చెప్పుకోతగ్గంత అందగత్తేంకాదు" అంది. ఇంకొక ఆవిడ అందుకుని "పువ్వులు గుచ్చుతుంటే ఆ అమ్మాయి పెళ్లికూతురు చిన్న వదినగారుట. చాలా బాగుంది కాదూ? చెక్కిన బొమ్మలావుంది. జడకూడా పెద్దదే." "పెద్ద కోడలు ఎవరు" అని ఇంకో ప్రశ్న. "ఆ పళ్లుఎత్తు ఆవిడ". పెళ్లి కూతురు అప్పగారు "రంగు లేకపోయినా కళయిన మొహము. ఈ పిల్లకేమర్రా నిక్షేపంలా వుంది" అంది.

ఇంతలో వెంకన్న సందు తలుపు తీసుకు మూర్తి వున్న గదిలోకి వచ్చాడు. మూర్తి బైటవున్న సామాన్లు లోపల పెట్టమని చెప్పిన, సందులోంచి వెనకపక్క పందిట్లోకి వెళ్ళాడు.కొత్తతాటాకు నీళ్ళతో తడిపిన వాసన, వంటింట్లో పిండివంటల తాలూకు నేతి వాసన, తులిసెమ్మగట్టుమీద కూర్చుని పద్మ కడుతూన్న పువ్వుల వాసన కలసి కొత్తవాసన సృష్టించాయి. పువ్వులు కడుతూన్న పద్మచేతిలో దారవుండ దొర్లి వచ్చింది. మూర్తి దానిని తీసి పద్మదగ్గరికి విసిరాడు. "మరదిగారికి దొడ్డిదారి తప్ప వీధిదారిని రావటము అలవాటు లేనట్టు వుందే" అంటూ పెత్తల్లికోడలూ వేళాకోళము చేసింది.

పద్మ మూర్తిని చూసి కొత్త పెళ్ళికూతురులా సిగ్గుపడుతూ, పువ్వులు అక్కడే వదిలి వంటగదిలోకి తప్పుకుంది. వచ్చినవాళ్లని పంపి మిగిలినవాళ్ళు అంతా పందిట్లోకివచ్చారు. మూర్తినిచూసి "ఎప్పుడువచ్చావు" అని ప్రశ్నలతో విసిగిస్తున్నారు. తల్లి మూర్తిదగ్గర కూర్చుని "ఎంత చిక్కిపోయాడో" అని ఆప్యాయంగా వీపు రాసింది. శాంతవచ్చి అన్నగారి దగ్గర కూర్చుంది. మూర్తి అమ్మమ్మ వచ్చి "తరువాత చెపుదురు గాని ముచ్చట్లు, ముందు వాడికి తినేందుకు ఏమయినా పెట్టి కాఫీ ఇవ్వండి" అని చెప్పింది.

"ఏమీవద్దు ఒట్టి కాఫీ తెమ్మ'న్నాడు మూర్తి.

"ఇప్పుడు వచ్చి వెళ్ళినవాళ్లు పెళ్ళివారి బంధువులు" అని చెపుతోంది వదినగారు.

మూర్తికి అంతమంది మద్యవున్నా ఏదో బెంగ, వంటరిగా వున్నట్టు బాదగా వుంది. "పద్మకి చెప్పాలి" అనుకున్నాడు. పద్మ తనతో మాట్లాడకుండా ఎందుకు దాక్కుంటుందో.

రాత్రి పది అయినా పద్మ జాడలేదు. మూర్తి గదిమేడమీద, కిందికి దిగి వచ్చాడు. మూర్తి అమ్మమ్మ, అమ్మ అంతా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. అక్కడకూడా పద్మ కనపడకపోతే నిద్రపోయిందేమో ననుకున్నాడు మూర్తి. ఇంతలో మూర్తి తల్లి "పద్మ పడుకుందా" అని అడిగింది. 'పెద్దక్క గదిలో పడుకుంది వదిన" అని శాంత చెప్పింది.

మూర్తి అక్కడికి వెళ్ళాడు. మూర్తిని చూసి లేచి వెళ్లిబోయింది పద్మ. చెయ్యి పట్టుకు కూర్చోపెట్టాడు మూర్తి "ఎందుకు నాతో మాట్లాడకుండా సాయంత్రము నుంచి తప్పించుకు తిరుగుతున్నావు" అని జాలిగా అడిగాడు మూర్తి, తల వంచుకుంది పద్మ.

"నీకు ఓ సంగతి చెప్పాలి. చెపితే బాధపడతావేమో నని భయంగా వుంది" అని చెప్పి కొంచెంపేపు మౌనంగా కూర్చున్నాడు మూర్తి.

"మనింట్లో పనిచేసేపిల్ల"ఫ్లూ' వచ్చి పోయింది అని చెప్పి, ఆ పిల్ల రావటము, తాను చీకట్లో పొరపాటున చెయ్యి వెయ్యటము - ఆ పిల్ల తడిసివచ్చినరోజు దాకా జరిగినదంతా పద్మకి చెప్పాడు మూర్తి. "పోయే రోజున తనమాటే పోయే దాకా అంది " అని అప్పలమ్మ చెప్పిందని చెప్పాడు. "నామాట అంటూనే కళ్లు మూసిందిట" అన్నాడు మూర్తి. పద్మ చూపు వోదార్చినట్టు జాలిగా చూసింది. మూర్తికి మనస్సులో బాధ అంతా పోయి తేలిక అయినట్టు వుంది. "మూతలుపడే కళ్లు తెరుచుకున్నంత హాయిగా వుంది. నీకు చెప్పేదాకా ఎంతో బాధగా వుంది నాకు. ఇప్పుడు ఎంతో హాయిగా మూసుకున్న కళ్లు అందమైన లోయలో ప్రవాహపునీరును చూసేందుకు తెరచుకున్న కళ్ళల్లావుంది మనస్సు" అంటూ ఒళ్ళో తల పెట్టుకు పడుకున్నాడు మూర్తి.